క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: సబ్‌స్టేషన్ పరిధి గుర్రంగూడ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ రవీందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టల్ కాలనీ, గోల్డ్ ఫేజ్ కాలనీ, జక్కిడి శక్తిరెడ్డి కాలనీ, సావిత్రి అమ్మ కాలనీ, బాబిర్‌రెడ్డి కాలనీ, వెంకటేశ్వర కాలనీ, శ్రీనివాసపురం కాలనీ, గాద్వి ఎన్‌క్లేవ్, వినాయకనగర్, శ్రీకృష్ణ కాలనీ, పంచాయతీరాజ్ కాలనీ, బృందావనం కాలనీకి సరఫరాలో అంతరాయం కలగనుంది. దీంతో పాటు ఆదిత్యానగర్ ఏరియాలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయింత్రం 5 వరకు ఆదిత్యానగర్, జయసూర్య పట్నం, జీబీఆర్ కాలనీ, శ్రీశ్రీ అవెన్యూ, గుర్రంగూడ గ్రామం, ఎస్‌బీఆర్ కాలనీ, సాయి దుర్గా కాలనీ, సాయి హోమ్స్, టీచర్స్ కాలనీ, టీచర్స్ గ్రిల్డ్ కాలనీ, రాజలక్ష్మి నగర్, శ్రీలక్ష్మి కాలనీ, మ్యాట్రిక్స్ రిచ్ వాల్యూలో సరఫరాకు ఆటంకం కలగనుందని ఏఈ పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తాయని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న బహిరంగ సభకు మండల నుంచి అధికార పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, మార్కెట్ డైరెక్టర్ నరేశ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు రాంచందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న యువకులు

మాడ్గుల: బాల్య మిత్రుడి కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన దుబ్బ రవికాంత్(30) ఇటీవల రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. దీంతో 2011- 2012 విద్యాసంవత్సరంలో మృతుడితో పదో తరగతి చదివిన మిత్రబృందం.. శుక్రవారం రూ.90 వేలను ఆర్థిక సాయంగా బాధిత కుటుంబానికి అందజేశారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి


కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

తుర్కయంజాల్: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్య పట్ల శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి అన్నారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం పురపాలక సంఘం పరిధి తొర్రూర్‌లో మెగా హెల్త్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బందికి కంటి పరీక్షలు, రొమ్ము క్యాన్సర్, స్క్రీనింగ్, బీపీ, షుగర్, గైనకాలజికి సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఓ శ్రీనివాసులు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వినయ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ సురేష్, డాక్టర్లు శిరీష, శృతి, తేజశ్రీ, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రుణాల అందజేత నేడు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ లక్ష్మి గార్డెన్స్‌లో ఈ నెల 19న ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందజేయనున్నట్లు మాజీ సర్పంచ్ కేశవులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి రానున్నారని పేర్కొన్నారు. సమావేశానికి నాలుగు మండలాల మహిళా సంఘాలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రావాలని ఆయన కోరారు.

చిగురిస్తున్న ఆశలు

పంచాయతీ పోరుకు ఆశావహుల ఆరాటం

- ఎన్నికల నోటిఫికేషన్ కోసం ఎదురుచూపు
- పల్లెల్లో విస్తృత పర్యటనలు
- ప్రజా కార్యక్రమాల్లో బిజీ



అబ్దుల్లాపూర్‌మెట్: స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఆశావహులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడమే ఆలస్యం అన్నట్లు పంచాయతీ బరిలోకి దిగడానికి సిద్ధంగా ఉన్నారు. పాలకవర్గాల గడువు ముగిసి ఏడాదిన్నర గడిచిన నాటి నుంచి ఇదిగో అదిగో ఎన్నికలు అంటూ ప్రభుత్వం తరచూ సంకేతాలు ఇస్తూనే వస్తుంది. తాజాగా ఎన్నికల నిర్వహణ కోసం.. ఎన్నికల సంఘం తరఫున వస్తున్న ప్రకటనలు, అధికారులు ఎన్నికల సామగ్రి పరిశీలన, బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమాలను విస్తృతం చేయడంతో పంచాయతీ పోరు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. దీంతో పల్లెల్లో స్తబ్దుగా ఉన్న రాజకీయం వేడెక్కింది. ఎంపీటీసీ, సర్పంచ్ బరిలోకి దిగి, తమ భవిష్యత్తును పరీక్షించుకోవాలని నాయకులతో పాటు యువతీ యువకులు, పారిశ్రామిక, విద్యావేత్తలు సైతం ఉవ్విళ్లూరుతున్నట్లు సమాచారం. పార్టీ గుర్తులతో ఎన్నికలకు సంబంధం లేకపోయినప్పటికీ.. అన్ని రాజకీయ పార్టీలు పల్లెపోరును సవాల్‌గా తీసుకుంటున్నాయి. ఆ పార్టీల నేతలు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తూ.. కార్యకర్తలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, పార్టీ బలపర్చిన అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్నారు.

తొలుత జెడ్పీనా? పంచాయతీనా?

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో ఇప్పటికే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కోసం సర్పంచ్, వార్డు సభ్యుల వారీగా గుర్తులను ఎంపిక చేయడంతో పాటు ఎంపీటీసీ స్థానాలకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను అధికారులు వెల్లడించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్‌లోగా స్థానిక ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేయడం విధితమే. రాష్ట్ర వ్యాప్తంగా జెడ్పీచైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీల సంఖ్యను ప్రభుత్వం ప్రకటించడంతో ఎన్నికల ప్రక్రియ త్వరలోనే షురూ కానుందని పలువురు రాజకీయ నాయకులు పేర్కొంటున్నారు. అయితే జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు ముందు నిర్వహిస్తారా? పంచాయతీ పోరా అనేది స్పష్టత రావాల్సి ఉంది.

14 సర్పంచ్.. 8 ఎంపీటీసీలు

అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని 14 పంచాయతీల్లో సర్పంచ్, 8 ఎంపీటీసీ స్థానాల్లో పోరుకు అవకాశం ఉన్నట్లు సమాచారం. మండలంలోని 14 గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నట్లు తెలుస్తోంది. 18 గ్రామాలకు 4 (తారమతిపేట, బాచారం, గొరెల్లి, కుత్బుల్లాపూర్) జీపీలు పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనం అయ్యాయి. ఇక మిగిలిన 14 గ్రామాల్లోని కొన్నింటిని కలిపి నగర పంచాయతీగా మార్పు చేస్తారన్న ప్రచారం జరిగినప్పటికీ.. ఆరు మాసాల క్రితం 8 ఎంపీటీసీ స్థానాల కోసం అధికారులు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెల్లడించారు. దీంతో 14 గ్రామాల్లో సర్పంచ్, 8 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

రిజర్వేషన్లపై ఆరా

పంచాయతీ బరిలో ఉన్నవారు.. తమ గ్రామంలో ఏ రిజర్వేషన్ వస్తుందోనన్న ఆతృతతో ఉన్నారు. మండల పరిధి గ్రామాల్లోని జనాభా ప్రకారం రిజర్వేషన్‌పై ఆరా తీస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండంలోని నాలుగు గ్రామాలు సమీప పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో విలీనం చేశారు. అందులోని రెండు పంచాయతీల్లో గతంలో ఎస్సీ రిజర్వు అయిన విషయం తెలిసిందే. అయితే ఆ రెండు స్థానాలను ప్రస్తుతం మిగిలి ఉన్న 14 పంచాయతీల్లో, ఏ గ్రామంలో రిజర్వు చేస్తారనే సందేహంలో నేతలు ఉన్నారు. అటు రిజర్వేషన్లు తేలక, ఇటు ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందో తెలియక ఆశావహులు సతమతమవుతున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కాంగ్రెస్‌తోనే ప్రజలకు న్యాయం
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, కాంగ్రెస్ పాలనలోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని పేర్కొన్నారు. నగరంలోని తన నివాసంలో ఎమ్మెల్యే.. పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద మంజూరైన చెక్కులను శుక్రవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఎవరికీ ఒక్క రేషన్‌కార్డు, ఒక్క పక్కా ఇల్లు ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. అధికారం చేపట్టిన అనతికాలంలో తమ ప్రభుత్వం అర్హులకు రేషన్ కార్డులు అందజేసిందని, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేశవులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రామకృష్ణ, జయమ్మ, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. ఆమనగల్లు పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ.. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, కార్యదర్శి శంకర్, నాయకులు శివశంకర్, చరణ్, శివ, వంశీ, కురుమిద్ద శివలు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

దివ్యాంగుల పింఛన్ పెంచండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కడ్తాల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలు, చేయూత పెన్షన్లు రూ.4 వేలకు పెంచాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో వీహెచ్‌పీఎస్- ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం సమితి టౌన్ అధ్యక్షుడు శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి 19 నెలలు గడుస్తున్నా హామీలు నెరవేర్చడం లేదని ఆరోపించారు. కొంత పింఛన్లు మంజూరు చేయడం లేదని విమర్శించారు. నిస్సహాయ స్థితిలో ఉండి, కేవలం పింఛన్ మీదనే ఆధారపడి జీవిస్తున్న దివ్యాంగులను, చేయూత పెన్షన్ దారులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం.. వారికి అన్యాయం చేస్తుందని విమర్శించారు. ఆగస్టు 13 లోపు పింఛన్ పెంచాలని, లేని పక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నెల 21న ఆమనగల్లులో నిర్వహించనున్న దివ్యాంగులు, చేయూత పెన్షన్‌దారుల జిల్లా సదస్సుకు వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, బీడీ కార్మికులు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాచారం జంగయ్య, జిల్లా నాయకులు వెంకటయ్య, సలీం, నేతలు బొత్యా, శ్రీను, వెంకటేశ్, అభిలాష్, సమితి జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్ మాదిగ, మండల అధ్యక్షుడు అబ్బు రమేష్, ఎంఈఎఫ్ నాయకులు రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

నూతన పీఆర్‌సీని అమలు చేయాలి


తపస్ సభ్యత్వం అందజేస్తున్న జిల్లా కార్యదర్శి రమేశ్

ఆమనగల్లు: ఎన్నికల ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్ డిమాండ్ చేశారు. నూతన పీఆర్‌సీని అమలు చేయాలని కోరారు. తలకొండపల్లి మండలంలోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తపస్ సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కస్తూర్బాగాంధీ విద్యాలయంలో పనిచేసే ఉపాధ్యాయులకు కనీస వేతనం స్కేల్ వర్తింపచేయాలన్నారు. సమ్మెకాలం వేతనాలు విడుదల చేయాలని, పెండింగ్ 5 డీఏలు అందించాలన్నారు. ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సంఘం మండల అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు పాండు, సభ్యులు శేఖర్, గణేశ్, రామదాసు, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో.. సిందూర్ కుంకుమార్చన


పాల్గొన్న భక్తులు

కడ్తాల్: మండల పరిధి అన్మాస్‌పల్లి శ్రీ రామేశ్వర వీరాంజనేయ జ్ఞాన సరస్వతి క్షేత్రంలో శుక్రవారం ప్రముఖ ఉపాసకులు జ్ఞాన ప్రసూనాంబ ఆధ్వర్యంలో సిందూర్ కుంకుమార్చన పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ భద్రత, క్షేమం, సైనికులకు ఆయురారోగ్యాలు, శక్తి సామర్థ్యాలను చేకూర్చాలని వేడుకున్నారు. లింగాష్టకం, లలిత సహస్రనామ స్తోత్రం, లక్ష్మీ అష్టోత్తరం, శ్రీలక్ష్మి అష్టకం, హనుమాన్ చాలీసా పూజలు జరిపారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు సీజీఆర్ చైర్ పర్సన్ లీలా అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సామాజిక సమరసత అభియాన్ తెలంగాణ ప్రాంత అధ్యక్షురాలు శోభారాణి, జయశ్రీ, దేవాలయ ధర్మకర్తలు, భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఫిజియోథెరపి చేయించుకోవాలి


ఫిజియోథెరపిని పరిశీలిస్తున్న ఎంఈఓ తదితరులు

మంచాల: దివ్యాంగ విద్యార్థులు ఫిజియోథెరపిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రాందాస్ అన్నారు. శుక్రవారం మంచాల మండల కేంద్రలోని భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఒకటి నుంచి 18 సంవత్సరాల వయస్సులోపు శారీరక దివ్యాంగులకు ఉచితంగా ఫిజియోథెరపి చేయిస్తుందని తెలిపారు. అవసరం ఉన్నవారు చేయించుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం భవిత కేంద్రంలో నిర్వహిస్తారని తెలిపారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా 18 మందిని గుర్తించామని, వారిలో ప్రతివారం 9 మందికి చొప్పున థెరపీ చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సమ్మి, ఐఈఆర్‌పీ కె.సత్యనారాయణ, ఎం. యాదయ్య, సీఆర్‌పీ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు సర్వీసులు తిప్పాలి


డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మంచాల: గ్రామానికి అదనపు బస్సులు నడిపించాలని మంచాల మండలం బండలేమూర్ గ్రామ ప్రజలు కోరారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం డీఎం వెంకటనర్సప్పకు వినతిపత్రం అందజేశారు. ఉదయం 8, మధ్యాహ్నం 12, సాయంత్రం 6 గంటలకు కుదాబాపల్లి వెళ్లే బస్సును కూడా బండలేమూర్ గ్రామం మీదుగా రాకపోకలు సాగించే విధంగా చూడాలని పేర్కొన్నారు. దీనికి స్పందించిన డీఎం.. పరిశీలన అనంతరం సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణ, నాయకులు శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ సర్వే నంబర్ 283లోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నరసింహ మాట్లాడారు. సర్వే నంబర్ 283లో సుమారు 80 ఎకరాల భూమిని ప్రభుత్వం 2006లో పీఓటీ కింద తీసుకుందని తెలిపారు. అయినప్పటికీ.. కొంతమంది దళారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు యథేచ్ఛగా కబ్జా చేసి, చుట్టూ ఫ్రీ కాస్ట్‌తో కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఈ భూమిని రక్షించి, స్థానికులు వ్యవసాయం చేసుకోవడానికి లేదా ఇళ్లు నిర్మించుకోవడానికి కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యులు ముత్యాలు, మహేశ్, బాలరాజు, సత్తయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

అధ్వానంగా రాయపోల్ రోడ్డు

మరమ్మతులు చేపట్టండి: బీజేపీ

ఇబ్రహీంపట్నం: రాయపోల్ గ్రామ ప్రధాన రహదారి గుంతలతో అధ్వానంగా ఉందని బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలోని ప్రధాన రహదారిపై ఉన్న గుంతల్లో వరి నాట్లు వేసి నిరసన వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోడ్డు సమస్య గురించి ఎమ్మెల్యేకు విన్నవించినా ఫలితం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, ప్రవీణ్, కార్తిక్, శివ, చంటి, విజయ్, బాస్కర్, నరేష్, శంకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలు వద్దు

బీజేపీ నేతలు డ్రామాలు కట్టిపెట్టాలని ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, అదే గ్రామానికి చెందిన మంఖాల కరుణాకర్ అన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పదించి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో ఈ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేయించారని గుర్తుచేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఈ నెల 15న (మంగళవారం) వెలువడ్డాయని తెలిపారు. టెండర్ ప్రక్రియ, అగ్రిమెంట్ పూర్తికాకుండా రోడ్డు నిర్మాణ పనులు ఎలా ప్రారంభం అవుతాయని ప్రశ్నించారు. విషయం తెలిసినప్పటికీ.. బీజేపీ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని కరుణాకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. త్వరలో రోడ్డు పనులు ప్రారంభంకానున్నాయని తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం


ఎస్‌ఐకి విరాళం అందజేస్తున్న గ్రామస్తులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామానికి చెందిన పలువురు విరాళం అందజేశారు. సూరిశెట్టి ఎల్లయ్య రూ.50వేలు, సురేశ్ రూ.11 వేలు, వీరబ్రహ్మం శ్రీనివాస్ రూ.10 వేల(మొత్తం రూ.71వేలు)ను స్థానిక నేత అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్‌ఐ శ్రీకాంత్‌కు అందజేశారు. ఇందులో నాయకులు చంద్రశేఖర్, విజయ్, నవీన్ ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

యాచారం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకే అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి


జంగారెడ్డిపల్లిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ శోభారాణి

ఆమనగల్లు: ప్రభుత్వ సూచనల మేరకు భూమి కలిగిన ప్రతిరైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆమనగల్లు వ్యవసాయ శాఖ ఏడీఏ శోభారాణి సూచించారు. ఆమనగల్లు మండల పరిధి గ్రామాల్లో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పొందడానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కు లింక్ మొబైల్ నంబర్‌తో సమీపంలోని వ్యవసాయ అధికారి, ఏఈఓలను సంప్రదించాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్, ఏఈఓ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాన్ని కాపాడుకుందాం


సమావేశంలో నినదిస్తున్న నాయకులు

కొత్తూరు: అట్రాసిటీ చట్టాన్ని రక్షించుకునేందుకు ఎస్సీ, ఎస్టీలు ఐక్యంగా ఉండాలని కుల అసమానతల నిర్మూలన సమితి ఆల్ ఇండియా కన్వీనర్ బండారు లక్ష్మయ్య పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సరోజన ఆధ్వర్యంలో మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో గురువారం రాత్రి కారంచేడు దళిత మృతవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ... నాడు కారంచేడులో దళితులపై జరిగిన మారణకాండకు నేటికి నలభై ఏళ్లు పూర్తయినట్లు చెప్పారు. దళితులపై ఆరోజు జరిగిన ఘటనతోనే ఎస్సీ, ఎస్టీ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. పీడితులు ఐక్యంగా ఉండి తమ హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి మోహన కృష్ణ, నాయకులు చక్రవర్తి, లక్ష్మయ్య, నరేష్, బబ్లు, భిక్షపతి, కౌసల్య, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు శానిటేషన్ సిబ్బందికి వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం: వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బందికి శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నామని కమిషనర్ సత్యనారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. అంతే కాకుండా మెప్మా రిసోర్స్ పర్సన్స్ ఆధ్వర్యంలో సెల్ఫ్, హెల్ప్ గ్రూప్స్ మహిళలు తయారు చేసిన ఆహార పదార్థాలు, వివిధ వస్తువులకు సంబంధించి ఫుడ్ ఫెస్టివల్, ప్రొడక్ట్ మెళా కార్యక్రమాలను స్థానిక బాలాజీ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

పట్టుతప్పితే.. ప్రాణాలకు ముప్పే


ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తున్న విద్యార్థులు

యాచారం: అరకొర బస్సులు. అవీ సమయానికి రావు. దీంతో బస్సుకోసం వేచిచూసే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతూ ఉంటుంది. సకాలంలో గమ్యం చేరుకోవాలనే తొందరలో రాకరాక వచ్చిన సర్వీసులో సామర్థ్యానికి మించిన ప్రయాణికులు ఎక్కి, ఫుట్‌బోర్డు ప్రయాణం చేయడం సహజంగానే జరుగుతుంటుంది. ఈ క్రమంలో ఏ మాత్రం పట్టుతప్పినా ప్రాణాలకు ముప్పు తప్పదు. అయినప్పటికీ బస్సుల కొరత, సమయ పాలన లోపించడం వెరసి మారోమార్గం లేక ఫుట్‌బోర్డు ప్రయాణం తప్పదని ఇక్కడ కనిపిస్తున్న చిత్రమే నిదర్శనం. యాచారంలో గురువారం సాయంత్రం ఓ యువతి ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తూ.. జారిపడి తీవ్రంగా గాయపడింది. అయినప్పటికీ.. శుక్రవారం సాయంత్రం అంబేడ్కర్ కూడలిలో ఆగిన బస్సులో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో.. విద్యార్థులు ఇలా వేళాడుతూ ప్రయాణించారు. యాచారం-తాడిపర్తి, యాచారం- పల్లెచల్కతండా, యాచారం- కందకూరు మార్గంలో రాకపోకలు సాగించే బస్సులు ప్రయాణికులతో నిత్యం కిక్కిరిసి ఉంటాయని ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. సంస్థ అధికారులు స్పందించి ఈ రూట్లలో సర్వీసుల సంఖ్య పెంచాలని కోరుతున్నారు.